క్లుప్తంగా

నవరత్నాల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను ఆదివారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో సమాచార శాఖ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏడాది పొడవునా ఏ నెలలో ఏ సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నామనది సంక్షేమ క్యాలెండర్ ద్వారా ముందుగానే ప్రకటించి తదనుగుణంగా ప్రభుత్వం ప్రజలకు లబ్ధి చేకూరుస్తుందన్నారు.

శ్రీ మఠంలో ప్రత్యేక పూజలు



రాఘవేంద్రుడికి నారికేళాలు సమర్పిస్తున్న నాయకులు

మంత్రాలయం రూరల్: ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆపరేషన్ చేయించుకుని క్షేమంగా ఇంటికి రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామ్ బ్రదర్స్ ఆదివారం శ్రీ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. 101 నారికేళాలు సమర్పించారు. అనంతరం రాంపురం గ్రామానికి చేరుకుని స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి శివరామ్ బ్రదర్స్ అందజేశారు.

శ్రీ మాతా పరమేశ్వరీ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఎంఎం కాలనీలో వెలిసిన శ్రీ మాతా పరమేశ్వరిదేవి ఆలయ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి గణపతి, కుమారస్వామి, నవగ్రహ, అష్టదిక్పాలక పూజలు, గోపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు జరిగాయి. సోమవారం శివపార్వతులకు అభిషేకం, అర్చన, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పురవీధులగుండా పల్లకీసేవ, భజన కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా మంగళవారం అమ్మవారికి విశేషాలంకరణ, అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సన్మానం



స్థలాన్ని దానం చేసిన దాతలను సన్మానిస్తున్న గణేకల్ వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్ : వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ కేంద్రానికి రూ.2 లక్షలు విలువ నాలుగు సెంట్ల స్థలాన్ని ఉచితంగా దానం చేసిన పట్టణం కల్లుబావికి చెందిన విద్యావతి, పురుషోత్తంరెడ్డి దంపతులను గణేకల్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, ఉచ్చీరప్ప, లక్ష్మయ్య, గిడ్డయ్య, నాగవేణి, శాంత కుమార్, సర్పంచ్ బంగారమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభం ప్రతిష్ఠించిన దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి తెరుబాజారులో వెలసిన ఆంజినేయ స్వామి దేవాలయంలో ఆదివారం గ్రామస్తులు, భక్తుల సమక్షంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా దేవాలయం చేరుకుని పూజలు చేశారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ పెద్ద నరసయ్య కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా అరెస్టు చేశామని ఎస్‌ఐ రమేష్‌బాబు ఆదివారం విలేకరులకు తెలిపారు. కర్ణాటకకు చెందిన 92 ఓసీ డీలక్స్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి బోయ పెద్ద నరసయ్యను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఘనంగా బసవేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- స్వామివారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కాశీ పీఠాధిపతి చంద్రశేఖర్ శివాచార్య, ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి
- కార్యక్రమానికి తరలివచ్చిన వివిధ మఠాల పీఠాధిపతులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కాశీ పీఠాధిపతి, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : స్థానిక ఎమ్మిగనూరు బైపాస్ వద్ద శ్రీ బసవేశ్వర కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కాశీ పీఠాధిపతి శ్రీ మద్‌కాశీజ్ఞాన సింహాసనాధీశ్వర పరమపూజ్య శ్రీశ్రీశ్రీ1008 జగత్‌గురు డా.చంద్రశేఖర్ శివాచార్య మహాస్వాములు, ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, వివిధ మఠాల పీఠాధిపతులు బసవేశ్వర స్వామి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా పురవీధుల్లో వీరశైవ కులబంధువులు, వీరశైవ యువకులు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. జై బసవేశ్వర నామస్మరణం మారుమోగింది. ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు నుంచి విగ్రహం వరకు బైక్ ర్యాలీ సాగింది. అనంతరం కాశీ పీఠాధిపతి, ఎమ్మెల్యే బసవేశ్వరస్వామి కాంస్య విగ్రహాని పూలమాలలు వేసి ఆవిష్కరించారు. తదనంతరం అనంతరం ఏర్పాటు చేసిన సభలో కాశీ పీఠాధిపతులు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వివిధ మఠాల పీఠాధిపతులు, వీరశైవ ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కాశీ పీఠాధిపతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బసవేశ్వరస్వామి గురించి, ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. రాష్ట్రంలో మొట్టమొదటగా ఆదోని పట్టణంలో బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన ఆదోనికి గర్వకారణమని, తనకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. బసవేశ్వరస్వామి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంతానికి బసవేశ్వర సర్కిల్ పేరు పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. కులమతాల తేడా చూపకుండా సమానంగా జీవనం సాగించాలని, ధర్మాన్ని పాటిస్తే వర్షాలు బాగా కురుస్తాయని, ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉంటారని, అప్పుడే తమ ప్రాంతం, దేశం బాగుంటుందని వివరించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వీరశైవుల ఐకమత్యత అభినందనీయమన్నారు. ఒకేమాటపై ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం చేయడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతిఒక్కరూ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీరశైవ సేవాసంఘం అధ్యక్షుడు శివరుద్రప్ప, సభ్యులు హెగ్గటి మహాదేవ్, కన్నె మల్లికార్జున, శరణబసవ, శివప్రకాష్, ఎమ్మెల్సీ డా.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

సత్తా చాటిన విద్యార్థినులు



శ్రావణి (555) ఐశ్వర్య(542) రంగమ్మ (531) సుస్మిత(529)

కౌతాళం: పదవ తరగతి పబ్లిక్ ఫలితాల్లో కౌతాళం లో మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలల నుంచి 340 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 234 మందిపాసై 69 శాతం విజయం సాధించారు. బాలురు మొత్తం 434మంది విద్యార్థులకు గాను 218మంది ఉత్తీర్ణులయ్యారు. 50శాతం ఉత్తర్ణత సాధించారు. నదిచాగి జెడ్పీ పాఠశాల విద్యార్థిని శ్రావణి అత్యధికంగా 555 మార్కులు సాధించింది. అదేవిధంగా యల్లన్నగౌడ్ 542 , సోమశేఖర్ 519 మార్కులు తెచ్చుకున్నారు. కౌతాళం జెడ్పీ పాఠశాల విద్యార్థి షబ్బీర్ హుసేన్ 524 మార్కులు సాధించాడు. హాల్వి గ్రామ జెడ్పీ పాఠశాలలో ఐశ్వర్య 542 మార్కులు సాధించగా కస్తూర్బా పాఠశాల విద్యార్థిని 510 మార్కులు కైవసం చేసుకుంది. రౌడూరు, ఉప్పరహాల్ పాఠశాలల్లో 80శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కుంటహాల్‌లో 57శాతం ఉత్తీర్ణత సాధించారు. బదినేహాల్ పాఠశాలలో రజియాబేగం 520 మార్కులు, కామవరం పాఠశాల విద్యార్థిని రంగమ్మ 531 మార్కులు, సుస్మిత 529 మార్కులు సాధించారు.

మంత్రాలయం రూరల్: మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 218 మందికిగాను 77 మంది పాసయ్యారు. అశ్విని 523 మార్కులు, ఉమేష్ 496 మార్కులు సాధించారు. మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 94 మందికి గాను 30 మంది పాసయ్యారు. కురువ ఉపేంద్ర 527 మార్కులు, ఎం.ప్రసన్న 526 మార్కులు వచ్చాయి. రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో 78 మందికి గాను 56 మంది ఉత్తీర్ణత సాధించగా లక్ష్మినరసింహా 542 మార్కులు, రాహుల్ 527, ఐశ్వర్య 521 మార్కులు సాధించారు.



లక్ష్మినరసింహ(542) రాహుల్(527) ఐశ్వర్య (521)

పెద్దకడబూరు : పదవ తరగతి ఫలితాల్లో మండల కేంద్రం పెద్దకడబూరు ఉన్నత పాఠశాల విద్యార్థి కే.కార్తిక్ అత్యధికంగా 556 మార్కులు సాధించాడు. మండలంలో 375మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 43శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 46.15శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు 75.71శాతం ఉత్తీర్ణత సాధించారు. బి.విశాలాక్షి 546 మార్కులు సాధించింది. చిన్నతుంబళం ఉన్నత పాఠశాల విద్యార్థులు 40శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా కంబలదిన్ని ఉన్నత పాఠశాల విద్యార్థులు 48శాతం ఉత్తీర్ణత సాధించగా కే.రామేశ్వరికి 502 మార్కులు వచ్చాయి. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



కే. కార్తిక్ (556) కే రామేశ్వరి(502) బి.విశాలాక్షి(546)

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆలూరు బైపాస్ రోడ్డులో బసాపురం వైపు వెళ్లే రహదారిలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆదోని పట్టణం బోయగేరికి చెందిన బోయ సూరి, బోయ అర్జున్ అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని వన్‌టౌన్ సీఐ విక్రమసింహా తెలిపారు. వారి నుంచి 10 బాక్సులు (180 ఎం.ఎల్.) ఒరిజినల్ చాయిస్ విస్కీ బాక్సు, హైవార్ట్స్ విస్కీ బాక్సు, ఒరిజినల్ చాయిస్ 90 ఎం.ఎల్. పరిమాణం గల 8 బాక్సులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా మద్యం సరఫరా చేసేందుకు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

– 20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ఆదోని–ఇస్వీ రహదారిలోని బాలకొలను నుంచి మాసా మసీదుకు వెళ్లే రహదారిలో బోయ రమేష్, బోయ నాగరాజు, బోయ హనుమప్ప నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విక్రమసింహా తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించామని, నిందితులపై కేసు నమోదు చేసి జైలుకు తరలిస్తున్నట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ విక్రమసింహా

ఎమ్మిగనూరు డీఎస్పీని కలిసిన ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: ఎమ్మిగనూరు డీఎస్పీగా నియమితులైన సీతారామయ్యను వైఎస్సార్‌సీపీ యువనేత ప్రదీప్‌రెడ్డి ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని శాంతి భద్రతల విషయంపై డీఎస్పీతో చర్చించారు. డీఎస్పీని కలిసిన వారిలో ఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మంత్రాలయం మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, పెద్దకడబూరు మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సేవాదల్ నాయకుడు లక్ష్మినారయణరెడ్డి ఉన్నారు.



డీఎస్పీ సీతారామయ్యను కలిసిన యువనేత వై.ప్రదీప్‌రెడ్డి

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోనెగండ్ల: ప్రభుత్వం రైతులకు అందజేసే సూక్ష్మ నీటి సాగు పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్, ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్, పంచాకులు ఉమాదేవి కోరారు. మండలంలోని పెద్దమరివీడు, కులుమాల గ్రామాల్లో బొప్పాయి, మిరప పంటలను ఆదివారం పరిశీలించారు. కల్లాల్లో ఆరబెట్టిన పండు మిరపను పరిశీలించి రైతుల పంట దిగుబడి, ఆరబెట్టుకునే విధానం, పంటకోతలు, అమ్మకం జరిపే విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అకాల వర్షాల వల్ల పంట ఉత్పత్తులను కాపాడుకునే పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే పురుగులు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం వేముగోడు గ్రామంలో మిరప పంటలలో సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా రాయితీపై అమర్చిన డ్రిప్ పరికరముల వినియోగాన్ని పరిశీలించి, డ్రిప్ వినియోగంపై రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజినేయులు, ఎమ్మిగనూరు ఉద్యాన శాఖ శ్రీవాణి, ఎంపిడీసీ జయరామిరెడ్డి, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమరివీడులో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు సూక్ష్మ నీటి సాగు పథకాలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ నీటి సాగు పథకం ఓఎస్‌డీ వై.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలదొడ్డి, కందనాతి, మాసుమాన్‌దొడ్డి, గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి, కులమాల, పెద్దమర్రివీడు గ్రామాల్లో వర్షాల కారణంగా దెబ్బ తిన్న మిరప, పండ్ల తోటలు, డ్రిఫ్ ఇరిగేషన్ అయన పరిశీలించారు. వర్షాల కారణంగా మిరప, పండ్ల తోటలకు ఎంత నష్టం వాటిల్లిందో తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని చెప్పారు.

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమాలు

కర్నూలు(సెంట్రల్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమాలకు శ్రీకారం చుడతామమని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్ స్పష్టం చేశారు. ఆదివారం అల్లూరి 99వ వర్ధంతి పురస్కరించుకొని అశోక్‌నగర్ జంక్షన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే ముజఫర్ నగర్ టి.నరసింహయ్య గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు సీహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామరాజు పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. అలాగే ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ, ఐఫ్టూ సంఘాల ఆధ్వర్యంలో గోకారి భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్, నాయకులు నాయకులు రమేష్, రంగనాయకులు, సురేష్‌నాయక్, శిరీషా, డీవైఎఫ్ఐ నాయకులు నాయకులు శిరీష, శంకర్, రంగప్ప, హుస్సేన్‌బాషు, అమర్, యోగి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్ల తోటల సాగు చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ కోడుమూరు డివిజన్ అధికారి మదన్‌మోహన్‌గౌడు సూచించారు. ఆయన ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. టమాట, బెండ, మిరప, ఉల్లి తదితర పంటల సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతునలు వివరించారు. మిరప పంటలో నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కూరగాయల పంటల్లో తెగుళ్లు, పురుగుల యాజమాన్యం గురించి సూచనలు ఇచ్చారు. కూరగాయలు, పండ్లతోటల్లో సాధ్యమైనంత వరకు కెమికల్స్ వాడకాన్ని తగ్గించాలని, పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు వినియోగించాలని కోరారు. ఉద్యాన పంటల్లో అధికోత్పత్తి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వివిధ చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, విత్తనశుద్ధి అత్యవసరమని, మొక్కల మధ్య తగిన దూరం పాటించాలని సూచించారు. తరచూ ఒకే పంట వేయరాదని, పంట మార్పిడి చేయాలన్నారు. రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు గడువు

ఆదోని అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో 2, 4, 6 సెమిస్టర్లు చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 10వ తేదీ వరకు గడువు అని ఆ కేంద్రం కో–ఆర్డినేటర్ మురళీమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు 6వ సెమిస్టర్ పరీక్షలు, అదేవిధంగా వచ్చే నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు, 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 2వ సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని చెప్పారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు స్థానిక అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

చిన్మయ మిషన్‌లో సమ్మర్ క్యాంపు

ఆదోని అర్బన్ : ఆదోని చిన్మయ మిషన్‌లో సమ్మర్ క్యాంపులో భాగంగా బాలవిహార్ అనే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఆరు సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వారికి భగవద్గీత, రామాయణం, భాగవతం గురించి అవగాహన కల్పిస్తున్నారు. పురాణాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. అదేవిధంగా చిన్నారులతో ఆటలు ఆడిస్తూ ఉత్తేజపరుస్తున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర : స్థానిక ఆదర్శ పాఠశాలలో 2023– 24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సవిత ఆదివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రవేశం కల్పిస్తారని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో ఉన్న పంప్ హౌస్ వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆదోని పట్టణానికి చెందిన బోయ వీరేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మాధవరం ఎస్‌ఐ కిరణ్ ఆదివారం తెలిపారు. అతని నుంచి 125 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఊరికి వెళ్లేప్పుడు సమాచారం తెలియజేయండి

ఆదోని అర్బన్ : వేసవి సెలవుల సందర్భంగా టూర్లు, ఊర్లకు వెళ్లే ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, తాము ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహా ఆదివారం విలేకరులకు తెలిపారు. ఊరికి వెళ్లేవారు విలువైన వెండి, బంగారం, నగదు, పత్రాలు ఇంట్లో పెట్టకుండా బ్యాంకు లాకర్‌లలో భద్రపరుచుకోవాలని సూచించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

ఆదోని అర్బన్ : ఆదోని గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు (సమ్మర్ క్యాంపు) నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి కె.సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు నీతి కథలు, సారాంశం చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పెయింటింగ్, మ్యూజిక్, డాన్స్, డ్రామా, యోగా తదితర క్లాసులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు స్టేజ్ ఫియర్ పోగొట్టడం, మేధాశక్తిని పెంపొందించడం జరుగుతుందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగశరణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లుబావిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండల పరిధిలోని సూగూరు గ్రామ శివారులోని వంక దగ్గర పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ 1730 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం ఎన్నికల నేపథ్యంలో మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఓ ప్రకటనలో తెలిపారు.

9 నుంచి జగనన్నకు చెబుదాం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అధినాయకుల సూచన మేరకు ఈనెల 9వ తేదీ నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆలూరు మండలం బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకలకు హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశీర్వాదించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరుకానున్నట్లు తెలిపారు.

నవ్వితే హృదయం పదిలం

కర్నూలు(హాస్పిటల్): మనసారా నవ్వితే హృదయం ఆరోగ్యంగా ఉంటుందని కార్డియాలజిస్టు, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను డాక్టర్ పి.చంద్రశేఖర్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 60 వేల లాఫింగ్ క్లబ్‌లు ఉన్నాయని, దీన్ని బట్టి నవ్వుకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందన్నారు. మనసారా నవ్వితే మెదడులో ఎండార్ఫిన్‌లు విడుదలై హృదయానికి మేలు చేస్తాయని, వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, మానసిక ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన తగ్గుతాయని, పలు రకాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. చిరునవ్వుతో మానవ సంబంధాలు, కమ్యూనికేషన్స్ పెరుగుతాయని, మనిషి జీవితకాలం పెరుగుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి దైనందిత జీవితంలో నవ్వును ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. నెం.: 72

(APMACS యాక్ట్, 1995 క్రింద నమోదై ఉన్నది). RBI లైసెన్స్ నెం. UBD, AP, 1671 P

#XIII/172, 173, షరాఫ్ బజార్, ఆదోని- 518301, కర్నూలు జిల్లా, ఏ.పి.

ఈ-వేలం అమ్మకపు ప్రకటన

SARFAESI యాక్ట్- 2002 క్రింద

(1) ... ఖాతా నెం. MTL200230141000172

ఆస్తి వివరణ

... డి.నెం. 3/14/1 గల ఇంటి (డాక్యుమెంట్ నెం. 3695/2010) ...

రిజర్వు ధర: రూ.12.00 లక్షలు — బయానా: రూ.1.20 లక్షలు

(2) ... ఖాతా నెం. 200220950001644 & OD.No.1644

ఆస్తి వివరణ

... 8841/2010 తేది: 10.12.2010 ...

రిజర్వు ధర: రూ.36.00 లక్షలు — బయానా: రూ.3.60 లక్షలు

ఆన్‌లైన్ ఈ-వేలం అమ్మకం/బిడ్డింగ్ ప్రతి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో 09.06.2023న మ.12.30 గం.ల నుండి మ.1.30 గం.ల మధ్య దిగువ వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా మాత్రమే నిర్వహించబడును.

నియమ నిబంధనలు

... (11) తనిఖీ కొరకు సదరు ఆస్తులు 05.06.2023న ఉ.11.30 గం.ల నుండి మ.1.30 గం.ల మధ్య తెరవబడును. ...

తేది: 04.05.2023 — సం/- అధీకృత అధికారి

ప్రదేశం: ఆదోని — శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్